

కథా కౌముది

# ప్రచారం

రాజ్ మోహన్ ఇవటూరి

శాంతతో పాటు రైతు బజారుకి వచ్చి ఎప్పుడు కూరలు కొనే చంద్రారెడ్డిగారి కొట్టుకి వచ్చాను. చూద్దును కదా అక్కడేదో ఘోరం జరిగినట్టు వందల మంది జనం ఆ ఇరుకులోనే నా అభిమాన కూరల కొట్టు పైకి ఎగబడుతున్నారు. తాజా కూరలు మాకోసం ప్రత్యేకంగా ఏరిపెట్టి పంపిణీ చేసే రెడ్డి దగ్గర తప్ప వేరేచోట కూరలు తీసుకోము. కానీ ఈరోజు ఈ కొట్టుకే ఇంత గిరాకీ ఎందుకు పెరిగిపోయిందో అని ఆశ్చర్యపోతూ ఈ రద్దీ ఇప్పటిలో తగ్గేలా కనిపించకపోయేసరికి "శాంతా! ఈ రోజుకి కూరలు కొనలేం." అన్నాను.

"మనిద్దరం కలిసి బైల్దేరినప్పుడే ఇలాంటి అఘాయిత్యం జరుగుతుందని ఊహించాను" అని వెంటనే సమాధానం ఇచ్చింది జీవితంలో నాపట్ల ఒక్కసారి కూడా రవ్వంత శాంతం చూపించని శాంత. ఇలా మాట్లాడకపోతే ఆశ్చర్యపోవాలి కనుక ఆ మాటలకి నేను నొచ్చుకోలేదు. ఈలోపల అక్కడున్న జనాల మధ్య సందుల్లోంచి కొద్దికొద్దిగా కనిపించిన ఆ మనిషిని చూసాక ఈ హంగామా అంతా ఎందుకో నాకు అర్ధమయ్యింది.

ప్రముఖ వ్యాపారవేత్త రత్నాకర్ భార్య రాధామణి, చంద్రారెడ్డి బదులుగా కెమెరాల ముందు కూరలు అమ్ముతూ(న్నట్టు) కనిపించారు. రెడ్డి దర్జాగా కూర్చుని చోద్యం చూస్తున్నారు. అప్పుడు చుట్టూ చూస్తే దేశంలోని అన్ని ప్రచార మాధ్యమాలూ అక్కడే ఉన్నారని గమనించాను. బీబీసీ, సీఎన్నెన్ తరపున కూడాఎవరైనా వచ్చాయేమో అని చూసాను గానీ అప్పటికయితే రాలేదు. విషయం అర్ధమయ్యాక ఆ రోజుకి కూరల కార్యక్రమం పూర్తిగా పక్కన పెట్టి ఆ వ్యవహారం చూస్తూ నించున్నాను.

రెండు మూడు కూర ముక్కలు కెమెరా సాక్షిగా ఆవిడ అమ్మేసి ఇంకా అమ్మాలని ఉబలాటపడుతుంటే కొందరు పాత్రికేయులు అత్యుత్సాహంతో ప్రశ్నలు మొదలెట్టేసారు.

"మీరు వ్యాపారవేత్త భార్యగా మాత్రమే కాకుండా ఒక మేధావిగా మాకందరికీ తెలుసు. ఎన్నో గొప్ప పుస్తకాలు రాసారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థల ద్వారా సమాజ సేవ చేశారు. అలాంటిది ఈరోజు కూరలు ఎందుకు అమ్మవలసి వచ్చింది?" అని ఒక పాత్రికేయుడు ప్రశ్నించాడు. (ఇదొక పిచ్చి ప్రశ్న. ఆవిడకి ఇదంతా మామూలే. పది రోజుల క్రితమే ఒక అన్నదాన కార్యక్రమంలో వంటగది బైట విడిగా అరుగు మీద కూర్చుని పిండి రుబ్బింది. ఆ రోజు కూడా ఇదే రకం కురుక్షేత్రం! అన్ని ఛానెల్స్ లోనూ అదే కార్యక్రమం క్లుప్తంగా చూసాక ఆరోజుకి టీవీ చూడలేదు.)

ఇంతలోనే ఆవిడ జవాబిచ్చింది. "మీలో ఎంతో మందికి తెలుసు. అవకాశం వచ్చినపుడల్లా నన్ను నేను సంస్కరించుకుంటుంటాను. ఆ ఉద్దేశంతోనే నాలో అహంకారాన్ని తగ్గించుకోవటానికి చేసే ఒక ప్రయత్నం ఇది."

ఎంతో వినమ్రతతో ఆవిడ ఇచ్చిన జవాబు వినగానే "వినయానికే మారు పేరయిన మీకు అహంకారమా?" అని ఆశ్చర్యంగా మరో పాత్రికేయురాలు అడిగింది.

ఆవిడ నవ్వి "ఎంతోమందికిలాగే నాలో కూడా ఎక్కడో అహం అనేది దాగి ఉంది. ఇలా తరుచు ప్రయత్నిస్తే అది అదుపులో ఉంటుంది." అంది.

ఇదంతా దూరం నుంచి వింటూ "ఈవిడ ఎంత గొప్పవారండీ. మీరూ ఉన్నారు. పత్రికలో ఒక కథయినా, ఆఖరుకి ఉత్తరం రాసినా "వీరేశ్వర రావు – గుంటూరు" అని కింద రాయకుండా పంపించారా?" అంది శాంత.

ఆ పత్రిక నియమావళి ప్రకారం వివరాలు ఇవ్వాలి కనుక ఆ రెండు ముక్కలు నా పేరు పక్కన రాసాను అని చెప్పలేదు. ఎందుకంటే నేనెంత వాజమ్మనో, చవటనో, నస్మరంతినో నిర్ధారించటానికి పెళ్లయిన తర్వాత ఆవిడకి అరనిముషం కూడా పట్టలేదు. కనుక నేను వివరించే ప్రయత్నం చేయకుండా "సరే పద. వెళదాం" అన్నాను.

"వెళ్లిపోవాలా? మొన్నఒక మహిళా మంత్రి గారు సామాన్య స్త్రీలా నేల మీద నడుస్తూ ఈ సంతలోనే ఎంతో వినయంగా ఆవిడ ఎప్పుడూ తినని ఉల్లిపాయలు బేరం చేస్తున్నపుడు నన్ను ఇలాగే లాక్కుపోయారు. ఈసారి అలా కుదరదు. ఈ మహా మహిళతో సెల్ఫీ తీసుకోకుండా నేను కదిలేది లేదు." అంది నా భార్య.

"నా నెత్తి! ఇక్కడ సెల్ఫీల కోసం ఆటోగ్రాఫుల కోసం పాత్రికేయులతో సహా వందల మంది ఎగబడుతున్నారు. ఇంకెంత మంది వస్తారో తెలియదు. అంతవరకూ నేను ఉండలేను." అన్నాను చికాగ్గా.

ఇంతలో "క్షమించండి. నేను మీకేమైనా సాయం చేయగలనా" అంటూ వచ్చాడొకతను. వాడు నా చిన్ననాటి మిత్రుడే కావటంతో ఆశ్చర్యపోయి "ఓరి గోపాలం. నువ్వేమిటి ఇక్కడ ?" అని అడిగాను.

వాడు జవాబు చెప్పేలోపల "సరే నువ్వే పని మీద వచ్చావో నాకెందుకులే గానీ ఒక సాయం చెయ్యి. నా భార్యామతల్లిని గౌరవంగా ఈడ్చుకుని సంత బైటికి తీసుకురా" అన్నాను.

"మీరుండండి." నా భార్య ఒక ఉరుము ఉరిమి "అన్నయ్యా. ఆవిడతో సెల్ఫీ కుదురుతుందేమో కనుక్కో" అంది.

"అదెంత పని? ఆవిడ మా పెద్దమ్మ కూతురే. నేను మాటాడతాను" అన్నాడు గోపాలం.

వాడు రాధా మణి గారి చుట్టమని అప్పటివరకూ తెలియకపోవటం వలన నేను ఆశ్చర్యంతో గుడ్లప్పజెప్పి చూస్తుంటే వాడు ఆ జనాల మధ్యలోంచి శాంతని కొట్టు దగ్గరికి తీసుకుపోయాడు. నేను ముళ్ళమీద నించున్నట్టు కాసేపు వేచి చూసాక నా భార్య ముసిముసి నవ్వులు నవ్వుతూ వచ్చింది. అంటే అనుకున్న పని అయిందన్న మాట!

గోపాలం గట్టివాడే. రాధా మణి గారితో చుట్టరికం కూడా గట్టిదే కాబోలు.

"ఏరా నీకు కూడా కావాలా సెల్ఫీ?" అన్నాడు గోపాల్ అదేదో కాశీ పట్నం చూడరబాబూ టెలిస్కోప్ అన్నట్టు.

"వద్దులే ఇక వెళ్తాం" అంటూ బయలుదేరాను. వా

డు ఆశ్చర్యపోయి "అదేమిట్రా అక్క సెల్ఫీ అంటే ఇంత లోకువా! ఎంత ఎదిగినా ఒదిగే ఉండాలని తరచుగా ఇలాంటి నియమాలు పాటించే వారిని ఇంకెక్కడైనా చూసావా?" అన్నాడు.

నేను గోపాలం వైపు చిరాగ్గా చూస్తూ "కారణం చెప్తే బాధపడతావేమో గానీ నేను వెళ్తాలే" అని నడవబోయాను.

ఇంతలో "బాబూ! ఒక్క సారి ఇలారా నాయనా." అని వెనకనుంచి వినిపించింది. నేను తిరిగి చూస్తే ఆశ్చర్యపోయేలా రాధామణి  గారు పిలుస్తున్నారు. అప్పటికి ఆవిడ వచ్చి చాలా సేపయిందేమో. జనసంద్రం కూడా పలచబడింది. పెద్దావిడ కదా అని అటు నడవక తప్పలేదు.

"నా తమ్ముడు నొచ్చుకునేటంత అభిప్రాయం నా పైన ఏముందో నిర్భయంగా చెప్పు బాబూ. ఇందాక నా మాటలు వినే ఉంటావు కదా. నన్ను నేను నిరంతరం సంస్కరించుకోవటమే నా ధ్యేయం." అన్నది ఆవిడ.

ఎంతో సౌమ్యంగా నిజాయితీగా ఆవిడ అడుగుతుంటే నేను కొంచెం తగ్గాను. "చెప్తే మీరు బాధ పడతారు"

"పరవాలేదు. నువ్వు చెప్పేది నాకు సరైనది అనిపిస్తే నీ అభిప్రాయాన్ని గౌరవించి నన్ను మార్చుకుంటాను. కాదు అనిపిస్తే నీతో చర్చిస్తాను (చర్చిస్తారో? లేక వాదిస్తారో?)" అంది ఆమె.

ఆమె మాటల్లో చిత్తశుద్ధి అర్ధయ్యాక నాకు జవాబు చెప్పక తప్పలేదు. ఎలా మొదలెట్టాలో తెలియక ఒక సారి గొంతు సద్దుకుని "మీకు ఇబ్బంది లేదంటే ముందు మీకో చిన్న కథ చెప్తాను." అన్నాను.

ఆవిడ నవ్వి "చెప్పు" అంది.

"ఒక రాజు గారు తనకెంతో ఆప్తుడైన మంత్రి మీదే కోపం వచ్చి పది కొరడా దెబ్బలతో శిక్షించాలనుకున్నారు. అయినా అప్పటివరకూ ఉన్న స్నేహాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ మంత్రినే శిక్షని ఎంచుకునే అవకాశం ఇస్తే మంత్రి గారు నెల రోజులు నగరం నడి మధ్యలో అందరు ప్రజలకీ చెప్పులు తుడుస్తానని చెప్పారు. తను అనుకున్న శిక్ష కన్నా ఇది ఇంకా తీవ్రమైనది అని రాజు గారు ఆశ్చర్యపోయినా వెంటనే వప్పుకున్నారు. అప్పుడు మంత్రి గారు కాషాయ బట్టలు వేసుకుని నగరం మధ్య గుడి బైట కూర్చుని "ప్రజలారా! నా అహంకారాన్ని తగ్గించుకోవటానికి మీ చెప్పులు తుడవాలని వ్రతం ప్రారంభించాను. దయచేసి మీ చెప్పుల్ని నాదగ్గర వదలండి" అని వినయంగా చెప్పి చెప్పులు తుడవడం మొదలెట్టాడు. ప్రజలు అతని చేత చెప్పులు తుడిపించుకున్నారు గానీ ఆయనకి భక్తితో నమస్కారాలు పెట్టారు. కొన్నిరోజుల తర్వాత మంత్రి గారికి చెప్పుల యోగి అని పేరు కూడా వచ్చి రాజు గారే వారి దర్శనానికి వచ్చారు." అని కథ ముగించాను.

ఆవిడ పగలబడి నవ్వింది. "చెప్పులు తుడవడం అనేది ఒక శిక్ష అని ప్రజలకి తెలియకుండా శిక్ష అమలు చేస్తే ఏం లాభం? అందుకే మంత్రి ఆ శిక్ష తనకి అనుకూలంగా మలుచుకున్నాడు" అంది.

"సరిగ్గా చెప్పారు. కానీ క్షమించండి. తెలిసోతెలియకో మీరు చేసేది కూడా అంతే. మంత్రి గారు శిక్ష విషయం దాచి చెప్పులు తుడిచి గౌరవం సంపాదించుకున్నారు. మీరు గుట్టుగా నిజాయితీగా చేయవలసిన పనికి బదులు అహంకారం తగ్గించుకునే ప్రయత్నం పేరుతొ మీడియా ముందు హంగామా చేశారు." అన్నాను.

"అలా ఎందుకనుకున్నావు? నా ప్రయత్నంలో చిత్తశుద్ధి ఉంది. "

"కావచ్చు. కానీ చూసేవాళ్ళకి అలా అనిపించదు. మనం చూస్తూనే ఉన్నాం కదా! రాజకీయ నాయకులు ఎవరింటికో భోజనానికి ఆటోలో ప్రయాణిస్తారు. కొందరు గొప్ప నాయకులు గుడిసెలో పెరుగు అన్నం తింటారు. మరొకరు లంబాడీలతో నాట్యం చేస్తారు. ఇవన్నీ కెమెరాల ముందు చేస్తే అవి కేవలం ప్రాచుర్యం పొందటానికి చేసే ఆర్భాటమే అంటారు కదా." అన్నాను నిర్మొహమాటంగా.

ఆవిడ ఒక్క క్షణం విస్తుపోయి "నిజమే బాబూ! కానీ మా పేరుతో వ్యాపారం చేసుకునేవారు నేను ఎక్కడికెళ్ళినా వచ్చేస్తారు. మా ప్రమేయం లేకుండానే ఇంటర్వ్యూలనో మరేదనో ఈ హంగామా చేస్తారు. నిజానికి నేను పాత్రికేయులని పిలవనేలేదు." అని నిజాయితీగా అంది.

"కానీ వచ్చారు. మీరు ఆదరించారు. ఇప్పుడు ఇంటికెళ్ళిపోతారు. సాయంత్రం వరకూ కూరలు అమ్మరుకదా!"

"సరే. నాది సరైన పద్ధతి కాదంటావు. ఎలా చేస్తే బావుంటోందో అది కూడా చెప్పు."

"అడిగారు కనుక నా సలహా ఇదే. మీరెవరో తెలియని చోటికి సెక్యూరిటీ వగైరా హడావుడి లేకుండా మీరొక్కరే వెళ్ళండి. ఒక సామాన్యురాలిలా సంత యాజమాన్యంతో బేరమాడి ఒక కొట్టులో స్థలం స్వంతంగా సంపాదించండి. నిజాయితీగా ఒక రోజయినా కూరలు అమ్మండి. అప్పుడు ఖచ్చితంగా అనుకున్నది సాధిస్తారు." తడుముకోకుండా అన్నాను.

"చిన్న వ్యాపారస్తులు ఆ చోటు సంపాదించుకోవటానికి ఎన్ని కష్టాలు పడతారో తెలుస్తుంది. కూరలు అమ్మటంలో సాధకబాధకాలు తెలుస్తాయి. ఇప్పటిలా సులువుగా రెడ్డికి డబ్బులిచ్చి కెమెరా ముందు కూరలు అమ్మే పద్ధతిలో "నేను అత్యంత వినయశీలిని" అనే గర్వమే మీకు మిగులుతుంది"

ఆవిడ ఒక్క క్షణం ఖంగు తింది. కానీ తేరుకుని "నేనున్న వాతావరణంలో ఇలా ఆలోచించ గలిగే అవకాశం లేదు. నిజం చెప్పాలంటే ఈ హంగామా అంతా నేను ఇన్నాళ్లూ ఇష్టపడుతూనే ఉన్నాను. నా కళ్ళు తెరిపించినందుకు నీకు ఎంతో రుణపడి ఉంటాను. ఇప్పుడు నీతో సెల్ఫీ తీసుకోవచ్చా?" అంది.

నేను ఆశ్చర్యంతో "సెల్ఫీ తీసుకునేటంత గొప్పవాడిని కాదు కదండీ! ఈ ఫోటో చూసి నేనెవరినని అడిగితే ఏం చెప్తారు?" అన్నాను.

ఆవిడ తడుముకోకుండా "నా గురువుల్లో ఒకరు అని చెప్తాను." అంది.

నేను వద్దని ఎంత ప్రయత్నించినా ఆవిడ పదేపదే చేసిన అభ్యర్ధనని మన్నించక తప్పలేదు.

"సెల్ఫీకి ముందు కావాలనే అడగలేదు. నువ్వెవరో తెలుసుకోవచ్చా? " అని అడిగింది ఆవిడ.

"నేను అడ్మిరల్ ఆఫ్ ఫ్లీట్ గా పదవీ విరమణ చేసాను. నా బిరుదుని పేరు పక్కన మరణం వరకూ జోడించుకోవచ్చని, ఆ తర్వాత కూడా నన్ను ఆ బిరుదుతోనే సంబోధించాలని ప్రభుత్వమే చెప్పింది. అయినా ఆ విషయాన్ని ఎక్కడా చెప్పుకోవటం లేదు. ఒక మనిషిగా బతుకుతున్నాను"

"దేశానికి అత్యున్నత స్థాయిలో సేవ చేసిన వాడివి. కానీ నేను మాత్రం నాకు జ్ఞానోదయం కలిగించిన గురువుగానే నిన్ను గుర్తుంచుకుంటాను. " అంది రాధామణి.

ఆవిడకి నమస్కరించి ఎప్పటిలాగే నా వైపు నిరసనగా చూస్తున్న భార్యతో పాటు నెమ్మదిగా నడిచాను.

***

COMMENTS